ఓం శ్రీ కృష్ణ పరబ్రహ్మణేనమః

# అష్టాదశ శ్లోక గీతా

సకల శాస్త్రముల యొక్క సారభూతము శ్రీమద్భగవద్గీత. ఉపనిషత్తుల సారసంగ్రహమే గీత. ఉపనిషద్రూప గోవుల నుండి పితుకబడిన అమృతమే గీత. ఈ గీతామృతమును పానము జేసిన ముముక్షువులకు యిక జన్మలేదు. మృత్యువు లేదు. గీతామృతపానము జేసిన వారికి జరామరణ రహితమైన మోక్షపదవి లభించుట తథ్యము. కలియుగ మానవులకిది సులభతర తరణోపాయము.

భగవద్గీతను పూర్తిగ అధ్యయనము జేయజాలని అశక్తులకు తగినటుల వారి వారి శక్తి ననుసరించి ఒక శ్లోకము, శ్లోక పాదమేని పఠించిన ఆయా ఫలము లభించునని గీతా మాహాత్మ్యమున వర్ణింపబడినది. గీతను పూర్తిగ పఠింపలేని, అవకాశము లేని వారి కొఱకయ్యే యీ 'అష్టాదశ శ్లోకి గీత'!

గీతలోని ఒక్కొక్క అధ్యాయములోని ముఖ్యమగు నొక్కొక్క శ్లోకము సంగ్రహింపబడి యియ్యది పూర్వులచే ప్రత్యేకింపబడినది. గీతను సంపూర్ణముగ పఠింపలేనివారు యీ 'అష్టాదశ శ్లోకి గీత'ను పఠించి, తదర్థమును భావించి, తత్ఫలమును బొందవచ్చును.

గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైశ్శాస్త్రవిస్తరైః (సం)]

నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ।

న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజన మాహవే ॥ 1-31 ॥

తా. ఓ కేశవా! అనర్థ సూచకములగు అపశకునములను కూడా జూచుచున్నాను. యుద్ధము నందు బంధు జనమును చంపినందువలన యెట్టి మేలును అగపడదు.

యోగస్థః కురు కర్మాణి సఙ్గం త్యక్త్వా ధనఞ్జయ ।

సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ 2-48 ॥

తా. ఓ అర్జునా! ప్రాప్తాప్రాప్తముల యందు అనగా కర్మానుష్ఠానము వలన గలిగెడు ఫలాఫలములందు సమబుద్ధి గలిగి యుండుట యోగమనబడును. కాన నీవు అట్టి యోగమును ఆశ్రయించి అనగా కర్మజన్య ఫలాఫలములందు సమబుద్ధి గలవాడవై, ఫలాసక్తిని వదలి కర్మలను జేయుము.

కర్మేన్ద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।

ఇన్ద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే ॥ 3-6 ॥

తా. కర్మేంద్రియములను అణచిపెట్టి మనస్సుతో విషయములను చింతించు మూఢాత్ముడు మిథ్యాచారుడు లేక మోసగాడని చెప్పబడును.

ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథాఽపరే ।

స్వాధ్యాయ జ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశిత వ్రతాః ॥ 4-28 ॥

తా. కొందఱు పాత్రను గుర్తెఱిగి ఉచిత ద్రవ్యాదుల నిచ్చుటయే యజ్ఞమని భావించుచున్నారు. మఱికొందఱు తపస్సే యజ్ఞమని తలంచుచున్నారు. ఇంక కొందఱు యమ, నియమాది అష్టాంగ యోగములనే యజ్ఞమని ఊహించి వాటిని అనుష్ఠించుచున్నారు. వేరు కొందఱు స్వాధ్యాయము (వేదాధ్యయనము), తదర్థావగమము జ్ఞానయజ్ఞమని భావించి అధ్యయన తత్పరులగుచున్నారు. ఈ విధముగ కఠోర వ్రతములను ఆచరించు పలువురు సాధకులు బ్రహ్మప్రాప్తి కొఱకై దీక్షతో తీవ్రముగ ప్రయత్నించుచున్నారు.

యతేన్ద్రియ మనోబుద్ధి ర్మని ర్మోక్ష పరాయణః ।
విగ తేచ్ఛాభయక్రోధో యః సదా ముక్త ఏవ సః ॥ 5-28 ॥

తా. ఎవడు యింద్రియములను, మనస్సును, బుద్ధిని నిగ్రహించి విషయాభిలాష, భయము, క్రోధము లేనివాడగునో, అట్టి మోక్షపరాయణుడగు మునిపుంగవుడు సదా ముక్తుడే. అతనికి ముక్తి సదా సన్నిహితమేనని భావము.

యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు ।
యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥ 6-17 ॥

తా. యథోచితములైన ఆహార విహారములు గలవాడును, కాలోచితములైన అనుష్ఠానములను అనుష్ఠించుట యందు తత్పరుడైన వాడును, ఉచిత నిద్రాజాగరణములు గలవాడును అగు యోగికి సకల దుఃఖములను పోగొట్టునట్టి యోగ సిద్ధి సులభముగ గలుగును.

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।
మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే ॥ 7-14 ॥

తా. త్రిగుణాత్మికమగు యీ నా దైవీమాయ దాట శక్యము గానిది. అయితే యెవరు నన్ను శరణు పొందెదరో, వారు మాత్రమే యీ మాయను దాటగల్గుదురు.

అగ్నిర్జ్యోతి రహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్ ।

తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ॥ 8-24 ॥

తా. అగ్న్యభిమాని దేవత, దివసాభిమాని దేవత, ప్రకాశాభిమాని దేవత శుక్లపక్షాభిమాని దేవత, షణ్మాసాత్మకమైన ఉత్తరాయణము యొక్క అభిమాని దేవతయును గల (దేవ) మార్గమున బోయిన బ్రహ్మవేత్తలు (బ్రహ్మోపాసకులు) క్రమముగా పరబ్రహ్మమును పొందుచున్నారు. వీరు తిరిగిరారు.

అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్ ।

సాధురేవ స మన్తవ్యః సమ్యగ్వ్యవసితో హి సః ॥ 9-30 ॥

తా. మీదు మిక్కిలి దురాచారియైనను పాప సంకల్పములను, వికల్పములను మాని అనన్య భావముతో ఆత్మ స్వరూపుడనగు నన్ను సేవించెనేని, అట్టివాడు దృఢమైన నమ్మకము గలవాడగుటచే సాధువనియే, శ్రేష్ఠుడనియే తలంచవలెను.

యో మామజ మనాదిం చ వేత్తిలోక మహేశ్వరమ్ ।

అసమ్మూఢః స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే ॥ 10-3 ॥

తా. ఎవడు నన్ను పుట్టుక లేనివానినిగను, ఆది లేనివానిని గను, సర్వలోకములకు నియామకునిగను లేక ప్రభువుగను దెలిసికొనుచున్నాడో వాడు మోహరహితుడు. అనగా యథార్థమైన జ్ఞానము గలవాడు. అట్టివాడు సర్వపాపముల నుండి విముక్తుడగుచున్నాడు.

మత్కర్మకృన్మత్పరమో మద్భక్తః సఙ్గవర్జితః ।

నిర్వైరః సర్వభూతేషు యః స మామేతి పాణ్డవ ॥ 11-55 ॥

తా. పాండు కుమారా! అర్జునా నాకు (దైవమునకు) ప్రీతికరములగు కర్మల జేయువాడును, నన్నే పరమగతిగా నమ్మియుండు వాడును, లౌకిక వస్తువులందు మమత్వము (ఆసక్తి) లేనివాడును, సర్వప్రాణులయందు వైరభావము లేక అన్నింటిని ప్రేమించువాడును అగు నా భక్తుడు నన్ను పొందుచున్నాడు.

శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానా ద్ధ్యానం విశిష్యతే ।

ధ్యానా త్కర్మఫలత్యాగ స్త్యాగా చ్ఛాన్తి రనన్తరమ్ ॥ 12-12 ॥

తా. అవివేకముతో కూడిన అభ్యాసము కంటె, పవిత్రమగు శాస్త్ర శ్రవణ జనిత జ్ఞానము శ్రేష్ఠము. అట్టి శాస్త్ర శ్రవణ జనిత జ్ఞానము కంటే తత్త్వజ్ఞాన సహితమగు ధ్యానము శ్రేష్ఠము. అట్టి తత్త్వజ్ఞాన సహిత ధ్యానము కంటె, కర్మఫలత్యాగము శ్రేష్ఠము. కర్మఫల త్యాగము వలన బంధ నివృత్తి, చిత్త శాంతి కలుగును.

ఇదం శరీరం కౌన్తేయ క్షేత్ర మిత్యభి ధీయతే ।

ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ॥ 13-2 ॥

తా. ఓ అర్జునా! ఈ శరీరము క్షేత్రమని చెప్పబడుచున్నది. దీనిని అనగా యీ క్షేత్ర ధర్మమును యెవడు ఎఱుగుచున్నాడో, వాడు క్షేత్రజ్ఞుడని, క్షేత్రక్షేత్రజ్ఞ స్వరూపమును గుర్తెఱిగిన తత్త్వవేత్తలు చెప్పుదురు.

మాంచయోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।

స గుణాన్సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥ 14-26 ॥

తా. ఎవడు అచంచలమైన భక్తి యోగము చేత నన్ను సేవించుచున్నాడో వాడు యీ త్రిగుణములను అతిక్రమించి బ్రహ్మసాక్షాత్కార జ్ఞానమును పొందుటకు అర్హుడగుచున్నాడు.

నిర్మానమోహా జిత సఙ్గదోషా

అధ్యాత్మ నిత్యా వినివృత్తకామాః ।

ద్వన్ద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞైః

గచ్ఛన్త్యమూఢాః పదమవ్యయం తత్ ॥ 15-5 ॥

తా. అభిమాన మోహములు లేనివారును, పుత్రమిత్ర కళత్రాదుల యందలి ఆసక్తిని జయించిన వారును, సదా ఆధ్యాత్మ జ్ఞాన నిష్ఠులును, కోరికలను అన్నింటిని వదలిన వారును, సుఖదుఃఖ హేతువులగు శీతోష్ణాది ద్వంద్వముల చేత విడువబడినవారును అగు జ్ఞానులు అవ్యయమగు ఆ మోక్ష పదవిని పొందుచున్నారు.

యః శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః ।

న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్ ॥ 16-23 ॥

తా. వేదోక్తములగు విధిప్రతిషేధములను అనాదర భావముతో విడచిపెట్టి, తనకు యిష్టము వచ్చిన రీతి, యెవడు స్వేచ్ఛగా ప్రవర్తించుచున్నాడో, వానికి పురుషార్థ ప్రాప్తి యోగ్యమగు తత్త్వజ్ఞానము గాని, ఇహపర సుఖము గాని, పరమగతియైన మోక్షముగాని యేదియు లేదు.

మనః ప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మ వినిగ్రహః ।

భావసంశుద్ధి రిత్యేతత్తపో మానస ముచ్యతే ॥ 17-16 ॥

తా. మనో నైర్మల్యము అనగా యేలాటి విషయ చింతలు లేకుండుట, ప్రశాంతత, యెప్పుడును పరమాత్మ స్వరూపమును మననము చేయుచుండుట (మౌనము), ఇంద్రియ నిగ్రహము, హృదయ పారిశుద్ధ్యము యివి మానసిక తపస్సనబడును.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।

అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥ 18-66 ॥

తా. సర్వధర్మములను (బుద్ధ్యాదీంద్రియ వ్యాపారములను) విడచి నన్నొక్కని శరణు పొందుము. అనగా తురీయావస్థలో నిలుపుము. నేను నిన్ను సకల పాపముల నుండి విముక్తుని జేసెదను. దుఃఖింపకుము.

యత్ర యోగీశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః

తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతిర్మతిర్మమ

**శ్రీ కృష్ణార్పణమస్తు**

**ఓం తత్ సత్**

సౌజన్యము : కర్మ, భక్తి, జ్ఞాన, యోగములను దెలిపెడు ఆధ్యాత్మిక మాసపత్రిక

'యథార్థ భారతి' 1966, డిసెంబర్ నెల సంచిక